క్లుప్తంగా

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి


ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్

మునగపాక : వినాయక చవితి సందర్భంగా మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేసుకునే వారు ముందస్తుగా పోలీసులు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయక చవితిలో భాగంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై విగ్రహాలు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు.

రాంబిల్లి: వినాయక ఉత్సవాలు నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసే మండపాలు, పందిళ్లకు పోలీసు శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ దీనబంధు సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

కొత్త రైస్ కార్డుల పంపిణీ


రామన్నపాలెంలో రైస్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): రామన్నపాలెంలో కొత్తగా మంజూరైన రైస్ కార్డులను ఎంపీటీసీ లాలం శ్రీను,సచివాలయం కన్వీనర్ నాయుడు బాబు చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని వర్గాలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


హిందీ భాషపై నిర్వహించిన పోస్టర్ మేకింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): భవానీ విద్యా నికేతన్‌లో హిందీ బాషా దినోత్సవం గురువారం నిర్వహించారు. హిందీ భాషపై వ్యాస రచన, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సుజాత, రాధారమణి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్, కరస్పాండెంట్ సంతోష్, లత పాల్గొన్నారు.

రాంబిల్లి: రాంబిల్లి ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు బేగం హిందీ భాష ప్రాధాన్యాన్ని వివరించారు. పలువురు విద్యార్థులు హిందీ భాష విశిష్టతను నాటిక ప్రదర్శన ద్వారా వివరించారు. ఎంఈవో సూర్యారావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వర్మ పాల్గొన్నారు.

యలమంచిలి : జాతీయభాష హిందీని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు భవానీ అన్నారు. స్టేషన్‌రోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హిందీ పద్యాలు, గేయాలు, నృత్య ప్రదర్శనలు విద్యార్థులతో నిర్వహించారు.

మడుతూరులో నూతన పింఛన్ల పంపిణీ


మడుతూరులో నూతన పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): మడుతూరులో గురువారం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కొత్తగా మంజూరయిన 28 పింఛన్లను సర్పంచ్ మోటూరు సంజీవి, ఎంపీటీసీ శనివాడ జువ్వాల నాయుడు చేతుల మీదుగా కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎం.శ్రీనివాస్, బలిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- చవితి వేడుకలకు సన్నద్ధం
- జోరందుకున్న గణేష్ విగ్రహాల తయారీ
- 200 మందికి రెండు నెలల పాటు ఉపాధి
- గ్రామీణ జిల్లాలో 50కిపైగా దుకాణాలు
- రూ.2 వేల నుంచి రూ.20 వేలు ధర


మట్టితో తయారు చేసిన చిన్న విగ్రహాలు


వివిధ రూపాల్లో తయారవుతున్న గణేష్ విగ్రహాలు

విఘ్నాలు తొలగించే వినాయకుని ప్రతిరూపాలు మెరుగులు దిద్దుకుంటున్నాయి. వినాయకచవితి దగ్గరపడడంతో గణేష్ విగ్రహాల తయారీలో శిల్పులు నిమగ్నమయ్యారు. ఈ నెల 18 న వినాయక చవితి కావడంతో రెండు నెలల ముందునుంచే విగ్రహాల తయారీ కార్యక్రమం జరుగుతోంది. పాయకరావుపేట, అడ్డురోడ్డు, యలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, తదితర జంక్షన్‌లలో ఏటా వందలాది విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తుంటారు.

నక్కపల్లి/పాయకరావుపేట: పాయకరావుపేట పట్టణంలో శ్రీకాకుళం నుంచి శిల్పులను తీసుకువచ్చి ఈ ప్రాంతంలో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసి విగ్రహాలను తయారు చేస్తున్నారు. స్థానికులతో పాటు తుని కుమ్మరి వీధి ప్రాంతానికి చెందిన పలువురు వినాయక విగ్రహాల తయారీలో పాలు పంచుకుంటున్నారు. ఆర్డర్ల ప్రకారం అడుగుసైజు నుంచి 12 అడుగులు, అంతకు పైన విగ్రహాలు తయారు చేయడంలో వీరంతా సిద్ధహస్తులు. గతంలో కాకినాడ, పెద్దాపురం, అనకాపల్లి, చోడవరం, సామర్లకోట, జగ్గంపేట తదితర ప్రాంతాలకు వెళ్లి విగ్రహాలను తీసుకొచ్చి ఉత్సవాలు నిర్వహించేవారు. ఇపుడు స్థానికంగా గుడారాలు ఏర్పాటు చేసి విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తుండడంతో ఉత్సవ నిర్వాహకులకు సౌలభ్యంగా మారింది. పర్యావరణాన్ని కాపాడడం కోసం మట్టితో తయారుచేసిన విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని జరుగుతున్న ప్రచారాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఆకర్షణ, వివిధ డిజైన్ల కోసం ఉత్సవ నిర్వాహకులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలపైనే మొగ్గుచూపుతున్నారు. తయారీదార్లు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తోపాటు, కడియా మట్టితో తయారు చేసిన విగ్రహాలను కూడా విక్రయిస్తున్నారు. పిండె కొద్దీ రొట్టె అన్నట్టు డబ్బు కొద్దీ విగ్రహం అన్న రీతిలో విగ్రహాల వ్యాపారం జరుగుతోంది. రూ.150 నుంచి రూ.20 వేలు విలువైన విగ్రహాలు లభిస్తున్నాయి. గణపతి, దేవీ నవరాత్రుల సందర్భాల్లో మాత్రమే తమకు ఉపాధి ఉంటుందని విగ్రహ తయారీదారులు చెబుతున్నారు. ముడిసరుకు, తయారీ ఖర్చు, కూలీల చార్జీలు పోను రూ.2వేలు దాటిన ఒక్కో విగ్రహం వద్ద రూ.300 నుంచి రూ.500 మిగులుతుందని చెబుతున్నారు. ఒక విగ్రహం రూపు దిద్దుకోడానికి నెల రోజుల సమయం పడుతుంది. విగ్రహం తయారు చేసే కూలీలకు రోజుకు రూ.1000 వేతనం చెల్లిస్తామని దుకాణాల యజమానులు చెబుతున్నారు. అడుగు నుంచి మూడు అడుగుల విగ్రహాలను మట్టితోనే తయారు చేస్తామంటున్నారు. ఒక్కో తయారీ కేంద్రం వద్ద 10 నుంచి 15 మంది పనిచేస్తున్నారు. పాయకరావుపేట, యలమంచిలి, అడ్డురోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద సుమారు 200 మంది కార్మికులు పనిచేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.


రూపుదిద్దుకున్న గణేష్ విగ్రహాలు

ఆర్డరుపై విగ్రహాల తయారీ



దాదాపు పదేళ్లుగా ఈ ప్రాంతంలో విగ్రహాలు తయారు చేస్తున్నాం. నా వద్ద 15 మంది కూలీలు పని చేస్తున్నారు. శ్రీకాకుళం నుంచి శిల్పులను తీసుకువచ్చి వారికి రూ.1000 వేతనం చెల్లిస్తున్నాను. ఎక్కువగా ఆర్డర్‌పైనే తయారు చేస్తున్నాం. ఆర్డర్ లేకపోయినా చిన్న విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తాం. వర్షాలు పడితే నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. ఈ ఏడాది అమ్మకాలు మందకొడిగానే ఉండే పరిస్థితి కనిపిస్తోంది. లాభాలు లేకపోయినా పెట్టుబడులు, కూలీ ఖర్చులు వస్తే చాలు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలే కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను కూడా విక్రయిస్తున్నాం. సైజును బట్టి ధర ఉంటుంది. మా వద్ద కనిష్టంగా రూ.3000 నుంచి గరిష్టంగా రూ.20వేల విలువగల విగ్రహాలు అందుబాటులో ఉంటాయి.

–చిన్నారావు, విగ్రహాల తయారీదారు, పాయకరావుపేట

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


పరుగుపందెం పోటీల్లో విద్యార్థులు


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. తిమ్మరాజుపేట అంతర్జాతీయ డేవిస్సీ స్కూల్లో నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులుంటారని వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. మండల స్థాయిలో ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం వస్తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రీడారంగ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు పాల్గొన్నారు.

సేవగరిడీలకు ప్రతీక

ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు.మునగపాకలో ఎర్ర వెంకయ్య తోడపెద్దు పాలుకొలుపు మహోత్సవం విజయవంతమైన నేపథ్యంలో గురువారం ప్రసాద్‌ను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత సంస్కృతి,సంప్రదాయాలను ప్రతీ ఒక్కరూ కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అర్హులందరికీ సామాజిక పింఛన్లు

పాయకరావుపేట : రాష్ట్రంలో అర్హులందరికీ సామాజిక పింఛన్లు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చిక్కాల రామారావు అన్నారు. పెంటకోట గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెంటకోట గ్రామంలో ఇంతవరకు 703 మంది పింఛన్లు పొందుతుండగా, మరో 50 మందికి కొత్తగా పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సర్పంచ్ నాగమణి తాతాజీ పాల్గొన్నారు.

యలమంచిలి : పార్టీలకు అతీతంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి అన్నారు. గురువారం ఏటికొప్పాక గ్రామంలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ లక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రవి, వైస్ సర్పంచ్ కర్రి సింహాచలం పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలో పలు పంచాయితీ సర్పంచ్‌లు నూతనంగా విడుదలైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. ఎస్.రాయవరంలో సర్పంచ్ భూపతి అప్పారావు 27 మందికి కొత్త పింఛన్లు అందజేయగా, తిమ్మాపురంలో సర్పంచ్ సత్యనారాయణ, వమ్మవరంలో సర్పంచ్ పాపారావు లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేశారు.

దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ భారతదేశ ఔన్నత్యాన్ని చాటాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సన్యాసినాయుడు కోరారు. నా మట్టి- నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం మట్టి సేకరణ ప్రారంభించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఎందరో జీవితాలను త్యాగం చేశారన్నారు. వారిని కన్నభూమికి గౌరవాన్ని తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అప్పన్నపాలెంలో బీజేపీ ఆధ్వర్యంలో నా మట్టి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు నాయుడుబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మేరుగు కాసుబాబు, నాయుడు, కన్నంనాయుడు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి


గంగాదేవిపేటలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ యామిని

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర కోరారు. గంగాదేవిపేటలో గురువారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. తాజా ఆహారంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమన్నారు. కాగా శిబిరానికి ఆరోగ్య అధికారి యామిని వైద్య సేవలందించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఏఎన్ఎం రమణి, అంగన్‌వాడీ టీచర్ లత, ఆశ కార్యకర్త ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం


మునగపాకలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక : ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం మునగపాక జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల జోలికి పోరాదన్నారు. వినాయక చవితి వేడుకలను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, సచివాలయ కన్వీనర్లు టెక్కలి కొండలరావు, బొడ్డేడ అప్పలనాయుడు, బొడ్డేడ మహేష్, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పార్టీ నాయకులు సూరిశెట్టి కన్నారావు, వేగి కృష్ణ, కొరుప్రోలు చిన్నారావు, మలసాల కిషోర్, జర్నలిస్టు ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్


వాలీబాల్ క్రీడను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి


అచ్యుతాపురంలో పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

యలమంచిలి : క్రీడలు విద్యార్థుల్లో శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసానికి పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి అన్నారు. గురువారం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గేమ్స్‌ను ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇక్కడ ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నియోజకవర్గం పరిధిలో సుమారు 200 మంది బాల బాలికలు తలపడ్డారు. అండర్ 14,17 విభాగాల్లో పోటీలు నిర్వహించగా, వాటి లో ప్రతిభ కలిగిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయికి ఎంపికలు నిర్వహించామని వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరావు, మూర్తి తెలిపారు.

పాయకరావుపేట : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని జెడ్పీటీసీ లంక సూరిబాబు అన్నారు. ఎస్.నర్సాపురం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఎంఈవో- 2 రమేష్‌బాబు, హెచ్‌ఎం జాన్సన్, గేమ్స్ నియోజకవర్గ కోఆర్డినేటర్ రవికుమార్, మండల కోఆర్డినేటర్ రత్నాలమ్మ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. అండర్ 14 విభాగం విద్యార్థులకు ఖో ఖో ,కబడ్డీ ,వాలీబాల్ తదితర క్రీడలు నిర్వహించారు. సుమారు 90 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ శ్రీనివాస్ తెలిపారు.

రాంబిల్లి: క్రీడలతో పలు ప్రయోజనాలున్నాయని జెడ్పీటీసీ నాగరాజు, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు అన్నారు. రాంబిల్లి ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయిలో స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను నాగరాజు, శిరీష శ్రీనుబాబు ప్రారంభించారు. మండలంలో 8 పాఠశాలలకు చెందిన 120 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. సర్పంచ్ రమణమ్మ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వర్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): గ్రామీణ స్థాయి క్రీడాకారులు తమ ప్రతిభను కనబరించేందుకు స్కూల్ గేమ్స్ దోహదపడతాయని ఎంపీపీ భర్త కోన బుజ్జి అన్నారు.అచ్యుతాపురం మండల స్కూల్ గేమ్స్‌ని గురువారం కైట్స్ విద్యా విహార్‌లో ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులు జాతీయ స్థాయి వెళ్లేందుకు శ్రమించాలని, దీనికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. కో–ఆప్షన్ జడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, కూండ్రపు విమలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబ్జి, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'నిర్దోషివైతే కోర్టులో నిరూపించుకో'


మాట్లాడుతున్న వీసం

నక్కపల్లి : తనమీద మోపిన అభియోగాలను నిజాయితీగా న్యాయపోరాటం ద్వారా ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన నక్కపల్లిలో పార్టీ నాయకులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కీము పేరుతో నిరుద్యోగులను మోసం చేసి సుమారు రూ.375 కోట్లు స్వాహా చేసి అడ్డంగా దొరికిపోయి జైలుకెళ్లిన చంద్రబాబుకు మద్దతుగా టీడీపీ నాయకులు దీక్షలు చేయడం సిగ్గుచేటన్నారు. సిఐడీ కేసులు నమోదు చేసి అన్ని ఆధారాలతో కోర్టుకు సమర్పిస్తే కోర్టు చంద్రబాబునాయుడికి 14 రోజుల పాటు రిమాండ్ విధించిందన్నారు. చంద్రబాబు ఏ నేరం చేయకపోతే రోజుకు కోటి రూపాయలు ఫీజు చెల్లించి ఢిల్లీనుంచి లాయర్లను ఎందుకు విజయవాడ పిలిపిస్తున్నారని నిలదీశారు.

ఘనంగా గాడిచర్ల జయంతి


చినదొడ్డిగల్లులో గాడిచర్ల చిత్రపటం వద్ద నివాళులు

నక్కపల్లి : గ్రంథాలయోద్యమ పితామహుడు గాడిచర్ల హరి సర్వోత్తమరావు 140వ జయంతిని గురువారం చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ గాడిచర్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనార్దన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించి, సంపాదకుడిగా సర్వోత్తమరావు గ్రంథాలయ ఉద్యమానికి ఎంతో పాటుపడ్డారన్నారు. ఆయన కృషి వల్లే గ్రంథాలయాలు ప్రజలకు చేరువయ్యారన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గాడిచర్ల సర్వోత్తమరావు జయంతి గురువారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు గాడిచర్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఏపీలో మొట్టమొదటి ఖైదు అయిన సర్వోత్తమరావు ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయం సంఘం అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు.

గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు


నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ప్రభుత్వ సంక్షేమంతో లబ్ధిదారులు ప్రయోజనం పొందారా...సీఎం చెప్పిన పథకాలు అన్నీ మీకు అందుతున్నాయా... ఏడాది ఎన్నిసార్లు ప్రభుత్వ పథకాలు అందుకుంటున్నారు.. పథకాలు అందడంలో ఇబ్బందులు ఉన్నాయా..? అంటూ పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రజలను ఆరా తీశారు. దార్లపూడిలో నాలుగో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రతి ఇంటిని సందర్శించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ. 9 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మాణం చేసిన అంగన్‌వాడీ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాల్లో దాదాపుగా ప్రభుత్వ కార్యకలాపాలకు సరిపడా భవనాలు నిర్మాణం జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైఎస్సార్ సీపీ నాయకులు నీలేంద్రరావు,బాబి,మల్లేష్, పెద ఈశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

మునగపాక : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్ కోరారు. అరబుపాలెం , వాడ్రాపల్లి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో గురువారం వరి, మొక్కజొన్న, చెరకు సాగు చేసే రైతులకు ప్లాంట్ హెల్త్ క్లినిక్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. వరి సాగులో వచ్చే సూక్ష్మధాతు లోపాలు, తెగుళ్ల యాజమాన్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జింక్ లోపం, పొటాష్ లోపం వరిలో గుర్తించామన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దంత వైద్య సేవలు

యలమంచిలి : విద్యార్థులు క్రమం తప్పకుండా దంత పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ పి.సింహాద్రినాయుడు అన్నారు. విజ్ఞ దంత వైద్యాలయం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు, పేస్టులు బ్రష్,సబ్బులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, డా.సోని,డాక్టర్ గీతాంజలి, హాస్టల్ వార్డెన్ అప్పలనాయుడు,శైలజ పాల్గొన్నారు.